క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత

కాళేశ్వరం : కాళేశ్వరం గ్రామానికి చెందిన కోల లక్ష్మి ఇటీవల ప్రమాదశాత్తు జారిపడి పోయింది. దీంతో ఆమె తలకు బలంగా దెబ్బ తగలడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు శస్త్రచికిత్స చేయాలని సూచించారు. దీంతో ఆమె కుమారుడు మహేష్ స్థానిక కాంగ్రెస్ నాయకులు కామిడి శ్రీనివాసరెడ్డి, లేతకరి రాజబాపులు ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు విషయం తెలియజేశారు. వెంటనే స్పందించిన మంత్రి రూ.5లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేశారు. దీంతో త్వరలో శస్త్రచికిత్స చేయించనున్నారు. ఎల్‌ఓసీ మంజూరు చేసినందుకు మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

మల్హర్ : ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టుకు 500 మీటర్ల పరిధిలో ఉన్న మండలంలోని పెద్ద తాడిచర్ల డేంజర్ జోన్‌లో ఉన్న నివాసగృహాలు, భూములు తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతి పత్రం ఇచ్చినట్లు కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు, తాడిచర్ల భూనిర్వాసితుల సంఘం అధ్యక్షుడు దండు రమేష్ బుధవారం కటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి డేంజర్ జోన్ ప్రాంతంలోని కూలిన పోయిన నివాస గృహాల ఫొటోలను డిప్యూటీ సీఎంకు చూపించినట్లు తెలియజేశారు. డేంజర్ జోన్‌లో గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను ఇరువురికి విన్నవించి, త్వరగా సమస్యను పరిష్కరించాలని కోరినట్లు ఆయన పేర్కొన్నారు.

గీతకార్మికుడికి గాయాలు

భూపాలపల్లి రూరల్ : తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడికి తీవ్రగాయాలైన సంఘటన భూపాలపల్లి మండలంలోని కమలాపూర్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం కమలాపూర్ గ్రామానికి చెందిన బుర్ర శంకర్ రోజు వారి వృత్తిలో భాగంగా బుధవారం ఉదయం కల్లు గీయడానికి తాటి చెట్టు ఎక్కాడు. కల్లు గీసి కిందకు దిగుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు మోకుజారీ కిందపడ్డాడు. దీంతో శంకర్‌కు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం భూపాలపల్లిలోని ఓ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. గీతవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న నిరుపేద కుటుంబానికి చెందిన శంకర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కిరీటం బహూకరణ

మహబూబాబాద్ రూరల్: పట్టణంలోని గోపాలపురం కాలనీలో గల పెద్దమ్మ తల్లికి పంచలోహ కిరీటాన్ని ఎన్ఆర్ఐ విద్యార్థి గుండెల వినయ్‌బాబు బుధవారం బహూకరించారు. ఈసందర్భంగా పెద్దమ్మ తల్లి దేవాలయ ట్రస్ట్ కార్యదర్శి ముత్యాల శ్రీనివాస్, సలహాదారుడు సింగని అశోక్ మాట్లాడుతూ.. ట్రస్ట్ చైర్మన్ గుండెల రాజు, రేణుక దంపతుల పెద్దకుమారుడు, ఎన్ఆర్ఐ గుండెల వినయ్ బాబు పెద్దమ్మ తల్లికి పంచలోహ కిరీటం బహుకరించారన్నారు. రూ.26 వేల విలువైన పంచలోహ కిరీటాన్ని అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించి అమర్చారు. దాతను ఆలయ ట్రస్ట్, నడిగడ్డ, హన్మంతునిగడ్డ ముదిరాజు పెద్దలు ఘనంగా అభినందించి, సన్మానం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ గుండెల రాజు, ఉపాధ్యక్షుడు కొండ సారయ్య, కార్యదర్శి ముత్యాల శ్రీనివాస్, కోశాధికారి భూముల వెంకన్న, సలహాదారులు సింగని అశోక్, అల్వాల వెంకన్న, హన్మంతునిగడ్డ, నడిగడ్డ ముదిరాజు సంఘం అధ్యక్షులు నాగరాజు, కొప్పు ఉప్పలయ్య, కార్యదర్శులు బాలకృష్ణ, మల్లేశ్, కోశాధికారులు శ్రీనివాస్, భూం నర్సయ్య, పుచ్చ వెంకటయ్య, ట్రస్ట్ డైరెక్టర్లు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మధు కుటుంబానికి అండగా ఉంటాం

ములుగు : భద్రాచలంలో మానుకోట పార్లమెంట్ ఎన్నికల విధులు నిర్వర్తించడానికి వెళ్లి బ్రేయిన్ స్ట్రోక్‌తో మధుకుమార్ హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎన్నికల విధుల నుంచి తిరిగి వచ్చిన ఉపాధ్యాయ సంఘాల నాయకులు పోరిక పూల్‌సింగ్, మోహన్‌లాల్, పోరిక శ్రావణ్‌కుమార్, సునీల్, అనంతరాం, జయరాం, రాజు, రఘురాం, సారయ్య, కిషన్, రాము మంత్రి ధనసరి సీతక్క దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌తో కలిసి కిమ్స్ ఆస్పత్రికి వెళ్లారు. మధుకుమార్ ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ములుగు, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల కలెక్టర్‌లతో ఫోన్‌లో మాట్లాడి విషయాన్ని వివరించారు. తనవంతుగా ఆర్థికసాయాన్ని అందించారు. మధుకుమార్‌కు అండగా ఉంటామని అన్నారు. స్పందించిన మంత్రికి ఉపాధ్యాయ సంఘాల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయుడికి మెరుగైన వైద్యం అందించాలి

ములుగు /ములుగు రూరల్ : ఎన్నికల విధుల్లో అస్వస్థతకు గురైన ఉపాధ్యాయుడు పోరిక మధుకుమార్ కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శిరుప సతీష్, ఏళ్ల మధుసూదన్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు హట్కర్ సమ్మయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ ఏఓకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకటాపురం(ఎం) మండలంలోని బూరుగుపేట ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడు ఎన్నికల విధుల్లో భాగంగా భద్రాద్రికొత్తగూడెంలో విధులకు హాజరై బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యాడని అన్నారు. ఉపాధ్యాయుడికి మెరుగైన వైద్యం అందించి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో బంజార ఉద్యోగ సంఘాల నాయకులు పోరిక మోహన్‌లాల్, మూడు కసన్‌సింగ్, సునీల్, సర్వన్‌కుమార్, సారయ్య నాయక్, సోమ్లా నాయక్, జయరాం, రఘురాం, నరేందర్, రమేష్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.


ములుగు రూరల్: ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


పరామర్శిస్తున్న సీతక్క, పక్కన బలరాంనాయక్

‘ఆధార్’ను లాక్ చేసుకోండి!

కాళేశ్వరం : ప్రతీ ఒక్కరికి ఆధార్ కార్డే ఆధారం అయింది. ఆధార్ కార్డు ప్రధాన గుర్తింపుగా మారింది. దీంతో వ్యక్తిగత సమాచారం అందులో నిక్షిప్తమై ఉంటుంది. దీని ఆధారంగా దొంగలు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. అందులోని వ్యక్తిగత సమాచారాన్ని కొందరు డార్క్ వెబ్‌లో విక్రయిస్తున్నట్లు కూడా తెలుస్తోంది. తమతమ ఆధార్‌ను ఇతరులు ఉపయోగించకుండా లాక్ చేసుకోవాలని నిపుణులు తెలియజేస్తున్నారు. బయోమెట్రిక్ సమాచారం సురక్షితంగా ఉంచుకోవడం కోసం చేయాల్సిన ముఖ్య విషయాలను తెలుసుకుందాం..

లాక్ చేయడం ఇలా..



- యూఐడీఏఐ ద్వారా ఆధార్ కార్డును జారీ చేస్తున్నారు. ప్రత్యేక సౌకర్యంతోపాటు బయోమెట్రిక్ సమాచారాన్ని కావలసినంతకాలం వరకు లాక్ చేయవచ్చు. మళ్లీ అన్‌లాక్ చేసే వరకూ ఎవరు కూడా దానిని ఉపయోగించలేరు.
- యూఐడీఏఐ వెబ్‌సైట్‌ను ఓపెన్ చేయడం లేదా మొబైల్ ఫోన్‌లో ఎంఆధార్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- ఆధార్ నంబర్, ఓటీపీ నమోదు చేయడం ద్వారా లాగిన్ అవ్వాలి.
- ఇక్కడ నా ఆధార్ విభాగంలో లాక్/ అన్‌లాక్ బయోమెట్రిక్స్ ఎంపిక చేయాలి.
- గుర్తింపును ధ్రువీకరించడానికి ఆధార్ నంబర్‌తో పాటు ఓటీపీని నమోదు చేయాలి.
- ఆధార్ బయోమెట్రిక్ సమాచారాన్ని సురక్షితంగా దాచుకోనేందుకు ।లాక్ బయోమెట్రిక్స్। ఎంపిక చేసుకోవాలి.
- ప్రక్రియ పూర్తైన తర్వాత, బయోమెట్రిక్ సమాచారం లాక్ అయినట్లు నిర్ధారణ సందేశం వస్తుంది.
- ఎప్పుడైనా బయోమెట్రిక్ సమాచారాన్ని తర్వాత అన్‌లాక్ చేయాలనుకుంటే, అదే విధానాన్ని పునరావృతం చేయాలి.
- ‘అన్‌లాక్ బయోమెట్రిక్స్’ ఎంపిక చేసుకోవాలి.

ప్రయోజనాలు ఇవీ..

ఆధార్ బయోమెట్రిక్‌ను లాక్ చేయడంతో ప్రయోజనాలు ఉంటాయి. బయోమెట్రిక్ సమాచారం లాక్ చేసినప్పుడు వేలిముద్ర, కనుపాపల స్కాన్ లేదా ముఖ గుర్తింపు డేటాను ఎవరూ ఉపయోగించలేరు. ఆధార్ ధ్రువీకరణ కోసం, ఓటీపీ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు మాత్రమే పంపిస్తారు. తద్వారా ఆధార్ ధ్రువీకరిస్తారు. ఇలా మీ సమాచారం ఎలాంటి సైబర్ నేరగాళ్లకు తెలియకుండా లాక్ చేసుకోవచ్చు.

బైకులు ఢీ.. ముగ్గురికి గాయాలు



దామెర: రోడ్డు దాటుతున్న బైక్‌ను మరో బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని పరసగొండ క్రాస్‌వద్ద బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఊరుగొండ గ్రామానికి చెందిన వినయ్, హసన్‌పర్తి మండలం వంగపహాడ్ గ్రామానికి చెందిన సాయిచరణ్ బైక్‌పై పసరగొండ క్రాస్‌వద్ద జాతీయ రహదారిపై రోడ్డు క్రాస్ చేస్తున్నారు. ఈ క్రమంలో పరకాలకు చెందిన ఓ వ్యక్తి ఎఫ్‌జెడ్ ద్విచక్ర వాహనంతో వేగంగా వచ్చి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలు అయ్యాయి. సాయిచరణ్‌ను అపోలో ఎస్ఎస్ఆర్ ఆస్పత్రికి, మరొకరిని గార్డియన్, మరొకరిని ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. కాగా సాయిచరణ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు.

ఆర్థికసాయం



ఆత్మకూరు : మండల కేంద్రానికి చెందిన నాగపురి మహేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అతనితోపాటు 1991 సంవత్సరంలో ఆత్మకూరు జెడ్పీహెచ్ఎస్‌లో చదువుకున్న పూర్వవిద్యార్థిలు బుధవారం మహేష్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.30 వేలు ఆర్థికసాయం అందించారు. మిత్రులు సతీష్, వాసు, పాపని రవీందర్, మూల ప్రవీణ్, సుగ్రీవుడు, వెంకట్‌రెడ్డి, పరమేశ్వర్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై లాఠీచార్జి అమానుషం

ఏటూరునాగారం : సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ అసెంబ్లీ నియోజక వర్గంలో ఎన్నికల విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయులపై లాఠీచార్జి చేయడం అమానుషం అని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హోట్కార్ సమ్మయ్య, పల్లె నాగరాజు బుధవారం ప్రకటనలో తెలిపారు. రెండు రోజులు విజయవంతంగా ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులపై లాఠీచార్జి చేయడం అన్యాయమన్నారు. ప్రజా పాలన అని చెబుతున్న ప్రభుత్వంలో ఉపాధ్యాయులపై దాడి చేయటం ఎంత వరకు సమంజసం అన్నారు. లాఠీచార్జి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నియామకం

రేగొండ : మండలంలోని భాగిర్తిపేట గ్రామంలో ధర్మ సమాజ్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా సిలువేరు విజయసాగర్‌ను నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తూరి రవీందర్ ప్రకటనలో తెలిపారు. ప్రధాన కార్యదర్శి గా మంద చిట్టిబాబు, ఉపాధ్యక్షుడిగా పెండెల రాకేష్, కోశాధికారిగా దీపక్, కార్యదర్శులుగా దాసరి సందీప్, పసుల అరవింద్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా విజయ సాగర్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన జిల్లా, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మండల నాయకులు సాంబశివుడు, సునీల్, దశరథం, అశోక్ పాల్గొన్నారు.

న్యాయం చేయాలని రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

ఏటూరునాగారం : మండల పరిధిలోని 163వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం ఇసుక లారీ ఢీకొని మృతి చెందిన రమేశ్ బంధువులు, కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలని రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. మండలంలో ఇసుక లారీలు ఇష్టారాజ్యంగా, అతివేగంగా వెళ్తున్నాయన్నారు. దీంతో స్థానిక ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారని వారు ఆరోపించారు. కాగా మంగళవారం కమలాపురం గ్రామానికి చెందిన రమేశ్ ఇసుక లారీ ఢీకొని మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. తప్పకుండా న్యాయం జరిగేలా చూస్తాననడంతో రాస్తారోకో విరమింప చేశారు.

హంతకులను కఠినంగా శిక్షించాలి

ములుగు రూరల్ : తాడ్వాయి మండలం కాటాపూర్‌లో అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సుజాతను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ దావూద్, రాజేందర్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సరోజన, సమ్మక్క బుధవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్‌గా విధులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న టీచర్‌ను అడవిలోకి తీసుకెళ్లి అత్యంత కిరాతకంగా హత్య చేయడం అమానుషమైన చర్య అని అన్నారు. ప్రభుత్వం విచారణ చేసి హంతకులను కఠినంగా శిక్షించాలని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

నిందితులను శిక్షించాలి

ఎస్ఎస్‌తాడ్వాయి : అంగన్‌వాడీ టీచర్ సుజాతను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పులి నర్సయ్యగౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన కాటాపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. కాటాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్‌గా పని చేస్తున్న సుజాత అందరితో అన్యోన్యంగా ఉండన్నారు. అటవీ ప్రాంతంలో సుజాతను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేయడం చాలా దారుణమన్నారు. దోషులను పట్టుకుని శిక్షించాలని ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

న్యాయం చేయాలి

మండలంలోని కాటాపూర్ అంగన్‌వాడీ టీచర్ సుజాతను హత్యచేసిన నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శులు ఎండీ దావూద్, కార్యదర్శి రత్నం రాజేందర్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సరోజన, కార్యదర్శి సమ్మక్క బుధవారం డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్ విధులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా అడవిలోకి తీసుకెళ్లి అత్యంత కిరాతకంగా హత్య చేయడం అమానుష చర్య అన్నారు.ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఏజెన్సీలో విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడీలకు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా దోషులను కఠినంగా శిక్షించాలన్నారు.

మొక్కల పెంపకంపై దృష్టి సారించాలి

దామెర : మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కల పెంపకంపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ కల్పన సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలను సిద్ధం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఏపీఓ శారద, ఫీల్డ్ అసిస్టెంట్లు, వనసేవకులు ఉన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీఓ కల్పన

గడువులోగా యూనిఫాం అందించాలి


శాయంపేట : క్లాత్ అందజేస్తున్న ఎంపీడీఓ


ఆత్మకూరులో..

శాయంపేట : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం నుంచి సరఫరా అయిన యూనిఫాంలను గడువులోగా అందించాలని ఎంపీడీఓ ఫణిచంద్ర, నోడల్ అధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో డ్వాక్రా మహిళలకు యూనిఫాం క్లాత్ అందించారు. పాఠశాలలు పునఃప్రారంభ గడువులోగా విద్యార్థులకు యూనిఫాం కుట్టి ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చిన యూనిఫాం కుట్టు క్లాత్‌ను బుధవారం మహిళా సమాఖ్య సభ్యులకు ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి అందించారు. పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేలోపు యూనిఫాంను కుట్టి విద్యార్థులకు అందించాలని సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సరైన కొలతలతో దుస్తులు కుట్టి ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం లలితాదేవి, ఎంఈఓ రమాదేవి, మండల ప్రత్యేకాధికారి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ రక్షణకు నిరంతర పోరాటం

మహబూబాబాద్ అర్బన్: బీఎస్పీకి ఓటు వేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరున కృతజ్ఞతలు తెలుపుతున్నామని బీఎస్పీ ఎంపీ అభ్యర్థి కోనేటి సుజాత అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఎస్పీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల్లో ప్రధాన పార్టీ అభ్యర్థులకు ధీటుగా మానుకోట లోక్‌సభ నియోజకవర్గంలో ప్రచారం నిర్వహించామన్నారు. ఎన్నికలకు సహకరించిన బీఎస్పీ నాయకులకు, మహిళలకు, యువతకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. రాజ్యాంగ రక్షణ కోసం బీఎస్పీ నిరంతరం దోహదం చేస్తుందన్నారు. ఈ అవకాశం కల్పించిన వారికి ప్రత్యేక అభినందనలు తెలుపుతుమన్నారు. నాయకులు శివరాజ్, విజయకాంత్, ప్రసాద్‌రావు, ముఖేష్, ఉపేందర్, రాజశేఖర్ వర్మ, కృష్ణవేణి, చాణిక్య, నాగన్న, శ్రీను, నరేష్, నాగరాజు, రేవంత్ నాయక్, సాగర్, శ్రీకాంత్, రాంబాబు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న సుజాత, తదితరులు

బాధితులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి

శాయంపేట : ఇటీవల కురిసిన అకాల వర్షం, ఈదురు గాలుల బీభత్సానికి ఇంటి పైకప్పు రేకులు కొట్టుకుపోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని బీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు మొగ్గం సుమన్ కోరారు. ఈ మేరకు బాధితులు గజ్జి సరోజన, సరిత ఇళ్లను పరిశీలించి పరామర్శించారు. అకాల వర్షంతో నష్టపోయిన నిరుపేద కుటుంబాల స్థితిగతులపై రెవెన్యూ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపించాలని అన్నారు. నష్టపోయిన ప్రతి రైతులకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. ప్రభుత్వ పరంగా తక్షణ ఆర్థిక సాయం అందించాలని కోరారు.


సరోజన ఇంటిని పరిశీలిస్తున్న సుమన్

సేంద్రియ ఎరువు తయారీ ఏది?

- కానరాని తడి, పొడి చెత్త సేకరణ
- నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు

రేగొండ : గ్రామాల్లో సంపూర్ణ పారిశుద్ధ్యం పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ముప్పు వాటిల్ల కూడదన్న ఉద్దేశంతో గ్రామాల్లో సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణానికి గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీని ద్వారా తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి సేంద్రియ ఎరువులు తయారు చేయడంతో పాటు మిగతా వ్యర్థాలను డంపింగ్ యార్డులో పోయాలి. ఇందుకు గాను రూ.లక్షలు వెచ్చించారు. కానీ గ్రామ పంచాయతీల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ఇది ఎక్కడ అమలుకు నోచుకోవడం లేదు. దీంతో లక్ష్యం నీరుగారుతోంది. ఉమ్మడి రేగొండ మండలంలో 37 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 37 సెగ్రిగేషన్ షెడ్లను నిర్మించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఒక్కో నిర్మాణానికి సుమారు రూ. 2.5 లక్షలు వెచ్చించారు. కాగా ప్రస్తుతం ఆయా గ్రామాల్లో సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. సెగ్రిగేషన్ షెడ్లు గ్రామాలకు దూరంగా ఉండడం, ఆయా చోట్ల తగినంత సిబ్బంది లేకపోవడం, అధికారుల పర్యవేక్షణ కొరవడడం వంటి అనేక కారణాలు లక్ష్యానికి అవరోధంగా మారుతున్నాయి. సాధారణంగా గ్రామాల్లో సేకరించిన చెత్తను తడి, పొడి చెత్తగా గుర్తించి వేరు చేసి షెడ్లలో వేసి ఎరువు తయారు చేయాలి. ఇలా తయారైన ఎరువును గ్రామపంచాయతీలు విక్రయించి అదనపు ఆదాయాన్ని పెంచుకోవాలనేది వీటి ఉద్దేశం. కానీ గ్రామ పంచాయతీల్లో సిబ్బంది సేకరించిన చెత్తను మొత్తం డంపింగ్ యార్డ్ వద్దకు ట్రాక్టర్ ద్వారా తీసుకెళ్లి నిప్పు పెడుతున్నారు. కాలుతున్న వ్యర్థాల నుంచి వెలువడుతున్న కాలుష్యంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.


రేగొండలో నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్డు

తయారు కాని ఎరువు.. వృథాగా నిర్మాణాలు

మండలంలో 37 గ్రామ పంచాయతీలు ఉండగా గత ప్రభుత్వం గ్రామ పంచాయతీకో ట్రాక్టర్, నీళ్ల ట్యాంకర్‌ను కేటాయించింది. గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేరు చేసేందుకు చెత్త బుట్టలను పంపిణీ చేసింది. తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించక పోవడంతో గ్రామాల్లో ఎరువు తయారు చేసిన దాఖలాలు లేవు. కొన్ని చోట్ల ఒకే స్థలంలో శ్మశాన వాటిక, కంపోస్టు షెడ్లు నిర్మించారు. సేంద్రియ ఎరువు తయారు చేసేలా నిర్మించిన కంపోస్టు షెడ్లు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుంది. ప్రత్యేక అధికారుల పాలనలోనైనా కంపోస్టు షెడ్లపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకువస్తాం



గ్రామాల్లో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు (సెగ్రిగేషన్ షెడ్ల)ను వెంటనే వినియోగంలోకి తీసుకువస్తాం. గ్రామాల్లో నిత్యం చెత్త సేకరణ జరిగేలా పంచాయతీ కార్యదర్శులను ఆదేశించాం. షెడ్లలో సేంద్రియ ఎరువు తయారీకి చర్యలు తీసుకుంటాము.

\- వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీఓ

అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు చేశాం

- పెండింగ్ బిల్లులు ఇచ్చి ఆదుకోవాలి
- మాజీ సర్పంచ్ వేడుకోలు

నడికూడ : గ్రామాభివృద్ధి కోసం గత ప్రభుత్వం అప్పగించిన అభివృద్ధి పనులను అప్పులు తెచ్చి పూర్తి చేశామని, ఇప్పటి వరకు బిల్లులు రాలేదని నడికూడ మాజీ సర్పంచ్ ఊర రవీందర్‌రావు వాపోయారు. తెచ్చిన అప్పులకు వడ్డీ పెరుగుతోందని పెండింగ్ బిల్లులు చెల్లించి ఆదుకోవాలని కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామం బాగుండాలి, అభివృద్ధి పథంలో నడవాలనే ఉద్దేశంతో విపత్కర పరిస్థితుల్లో కూడా అభివృద్ధి పనులను నిలుపుదల చేయకుండా పూర్తి చేశామన్నారు. గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధికి సంబంధించిన రూ.50 లక్షలు వరకు బిల్లులు చెల్లించలేదని అన్నారు. ప్రభుత్వం పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరారు. బిల్లుల చెల్లింపులో జాప్యం కొనసాగితే రానున్న రోజుల్లో పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రారన్నారు. మాజీ సర్పంచ్‌లకు ఆత్మహత్యలే శరణ్యమని అన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

పరకాల : క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని దామెర ఏఎస్సై ఇనుగాల రాజురెడ్డి అన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గత నెల రోజులుగా జరుగుతున్న ఉచిత సమ్మర్ క్రికెట్ క్యాంప్‌లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు ప్రోత్సాహక బహుమతులు, అవార్డులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని అన్నారు. క్రీడల్లోనే పోటీ పడాలని, వ్యక్తిగతంగా కలిసిమెలిసి ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్లేయర్ అవార్డు గంద్ర సాయి ఈశ్వర్ సాధించగా ఉత్తమ బ్యాట్స్‌మెన్‌గా అల్లం రణధీర్, బౌలర్‌గా నవదీప్ అవార్డులను అందుకున్నారు. దామెర గ్రామానికి చెందిన ఓ క్రికెట్ క్రీడాకారుడు రూ.5వేల విలువ చేసే క్రికెట్ బ్యాట్‌ను ఉత్తమ క్రీడాకారుడికి అందించారు. క్రికెట్ క్రీడాకారులకు టిఫిన్స్, అరటిపండ్లు, కోడిగుడ్లు అందించారు. కోచ్ బొజ్జం అరుణ్, సమృద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.